# స్వతంత్ర భారతదేశం



## ఆరోజు సోమవారం

శ్రీ శ్రీగారు అన్నట్లు "ఫ్యాక్టరీలు మా పుట్టిళ్ళు. అవే మా దేవుడిగుళ్ళు" కనుక, ఆది వారం రాత్రంతా ఫ్యాక్టరీలో ఓవర్ టైం వర్క్ చేసి, తెలతెలవారుతుండగా రూంకి వచ్చి పడు కున్నాను వెచ్చగా!

అంతలోనే ఆవతల ఏదో కొంపలు మునిగి పోతున్నట్టు రూం తలుపుని ఎవరో దబదబ బాదారు. బద్ధకంతోను, చిరాకుతోను మంచం దిగి లేచివెళ్ళి తలుపుతీశాను.

ఎదురుగా నేను అద్దెకుంటున్న కొంప (రూం) తాలూకు ఓనరుగారు

"అమ్మా! ఈరోజు వీక్లీ ఆఫ్ (శలవు) కదా! కాస్తంత ఆటుగావెళ్ళి కరెంటు బిల్లు కట్టి పెడుదూ" అంటూ బిల్లు+డబ్బు నా చేతికి అందించి వెనుతిరిగి వెళ్ళిపోయాడు పోస్ట్ మాన్ లా!

అప్పటికి సమయం ఉదయం తొమ్మిది గంట లయింది. ఆ సమయంలో అన్ని పట్టణాల్లాగానే హైదరాబాద్‌లోకూడా బస్‌స్టాపులు, బస్‌లుకూడా చాలారష్‌గాను, హడావిడిగాను వుంటాయి. అది కాలేజీలు, కాన్వెంట్లు, ఆఫీసుల టైం కనుక.

వాళ్ళకున్న తొందర నాకు లేదు కనుక, ఖాళీగావున్న బస్ ఎక్కచ్చు అనుకుంటూ, నేను నిలబడి బస్‌స్టాప్ ప్రక్కనేవున్న పాన్‌షాప్‌లో మిఠాయి కిళ్ళీ కొనుక్కుని దిక్కులుచూస్తూ నిల బడియున్నాను.

అంతలో ఎవరో నా వోణీని లాగినట్లని పించి ప్రక్కకుచూశాను.

సుమారు ఎనిమిది సంవత్సరాల వయస్సు గల కుర్రాడు నిలబడివున్నాడు. వాడి చేతిలో ఒక పలక, దానిమీద రెండవతరగతి అని రాసి వున్న టెక్స్టుబుక్ కనబడ్డాయి నాకు. కుర్రాడు కాస్త బొద్దుగానేవున్నాడు. కళ్ళలో అమాయ కత్వం తొణికిసలాడుతోంది. కాకినిక్కరు, పైన భుజాలవద్ద చిరిగిన తెల్లచొక్కా వేసుకున్నాడు. ఒక పిన్ను చొక్కాని పైనుండి క్రింది దాకా కలుపుదామని చేసిన ప్రయత్నం విఫలం కావటంచేత పైనసగం, క్రింద సగం విడిపోయి వుంది.

'ఏమిటి కథ' అన్నట్టు చూశాను వాడివైపు. వెంటనే వాడు "ఏమండీ నాకు స్కూలుకి టైం అయింది. కాస్తంత రోడ్డు దాటించరు" ప్రాధేయపూర్వకంగా అడిగాడు.

వెంటనే వాడిచెయ్యి పట్టుకున్నాను. రోడ్ క్రాస్‌చేసాం ఇద్దరం. నేను తిరిగి స్టాప్‌వద్దకు వచ్చేందుకు రోడ్ దాటుదామనుకుంటుండగా నా వెనుకనించి "ఏమండీ ఆకలేస్తుంది. ఒక పది పైసలు ఇవ్వరూ?" అంటూ దీనంగా అర్థిం చాడు.

అంత బుద్ధిమంతుడిలా కనిపిస్తున ఆ కుర్రాడు అలాగ అడిగేసరికి నాకు జాలేసింది. అంతలోనే మళ్ళీ అన్పించింది నాకు- "వాడు అడిగిన 10 పైసలు ఇవ్వటం కష్టంకాదు. కానీ అంత బుద్ధిగా చదువుకునే కుర్రాడిని పాడు చేసిన వాడినవుతానేమో?" ఇలాగే అనేక కోణాలలో ఆలోచించాను.

"పాపం నిజంగా వాడికి ఆకలిగావుందేమో? ఇప్పుడు నేను వాడికి ఇవడం మానినంత మాత్రాన వాణ్ణి, ఈ దేశాన్ని ఎలాగు ఉద్ధరించ లేను ఇలాగ అనుకొని వెంటనే హ్యాండ్ బ్యాగ్‌లోనుంచి చిల్లరతీసి ఒక అర్ధరూపాయి వాడికిచ్చి "బాగా చదువుకో!" అంటూ రోడ్ క్రాస్‌చేసి బస్‌స్టాప్ వద్ద నిలబడ్డాను.

మరో పది నిమిషాలలో బస్సు రానేవచ్చింది. ఎక్కేశాను. పని పూర్తిచేసుకొని తిరిగి బస్ ఎక్కాను. కోఠీలో బస్‌ని ఒకచోట ఆపాడు డ్రైవర్. అది టికెట్ ఇష్యుయింగ్ కంప్లీటింగ్ పాయింట్ కనుక, కండక్టర్ తీరుబడిగా అందరికీ టికెట్స్ ఇస్తున్నాడు. అక్కడి నుంచి రెండు స్టాప్స్ దాటితే నేను దిగవలసిన టువస్తుంది.

ఏదో ఆలోచిస్తూ అప్రయత్నంగా కిటికీ లోంచి చూశాను. బస్‌కి నాల్గయిదు గజాల దూరంలో ఇందాక నాతో మాట్లాడిన కుర్రాడు ఒక సూట్‌వాలాతో ఏదో అంటున్నాడు. సూట్ వాలా జేబులోకి చేయిపోనిచ్చి, చిల్లరడబ్బులు కుర్రాడికిచ్చి వెళ్ళిపోయాడు.

ఈసారి కుర్రాడు ఎదురుగా వస్తోన్న పంచె కట్టు ఆసామితో ఏదో మాట్లాడాడు. వెంటనే ఆ ఆసామి నవ్వుతూ కుర్రాడి చెయ్యి పట్టుకొని రోడ్డు దాటిస్తున్నాడు.

నాకు విపరీతమైన కోపంవచ్చింది, ఆ కుర్రాడుచేస్తోన్నపనికి. కానీ... నేను శపించేం దుకు మునినికాను. వాడిలాగే సామాన్య మానవు రాలిని, సగటు మనిషిని. కూటికోసం తాప త్రయపడుతూ - వినియోగించుకునే కోటి విద్య లలో ఇది ఒకటికాబోలు అనుకున్నాను. వాడిది సంపాదనే! నాదీ సంపాదనే తేడా అల్లా వాడు చదవకుండానే సంపాదిస్తున్నాడు. నేను చదువు కొని సంపాదిస్తున్నాను.

ఏది ఏమయినా, మన స్వతంత్రదేశంలో ప్రతిమనిషీ ఎలాగోలాగ బ్రతగ్గలడు అను కున్నాను గర్వంగా! కారణం?....

మనతల్లి "అన్నపూర్ణ"

మనభూమి వే(పే)ద భూమి కనుక!!

బస్ కదిలింది.

—మేరుగు పద్మావతి
కురాడ పోస్టు, కృష్ణా జిల్లా
521 356